తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## పోస్ట్ మాట్రిక్ మైనారిటీ బాలుర వసతి గృహము నందు ప్రవేశమునకు దరఖాస్తుల ఆహ్వానం

**కర్నూలు, జూన్ 20 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలో చదువుచున్న మైనారిటీ విద్యార్థుల (బాలురు) కొరకు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు పట్టణము నందు పోస్ట్ మాట్రిక్ మైనారిటీ బాలుర వసతి గృహమును (50 మంది విద్యార్థులకు) 2024-2025 విద్యా సంవత్సరంనకు మంజూరు చేసియున్నారు. సదరు మైనారిటీ వసతి గృహము నందు ప్రవేశమునకు దూరప్రాంతముల నుండి కర్నూలులో చదువుచున్న మైనారిటీ విద్యార్థులు అర్హులు. అయితే గత విద్యా సంవత్సరమునందు 20 మంది విద్యార్థులు వారి విద్యాభ్యాసమును పూర్తి చేసుకొనినందున 20 మంది విద్యార్థులకు పోస్ట్ మాట్రిక్ మైనారిటీ బాలుర వసతి గృహము నందు ప్రవేశమునకు అవకాశము కలదు. కావున ఆసక్తి గల మైనారిటీ విద్యార్థులు అనగా ఇంటర్ ఆపైన విద్యభ్యసెము చేయు విద్యార్థులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరడమైనది అని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరములకు సెల్ నం: 9052356257 ను సంప్రదించగలరు.

## పెబ్బేరు ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి నిధుల కేటాయింపుకు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

**సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**పెబ్బేరు, జూన్ 20 (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు మున్సిపల్ పట్టణంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి నిధులు విడుదల చేసి సహకరించగలరని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పెబ్బేర్ ప్రెస్ క్లబ్ గురువారం రోజుఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఆర్ ఏయీ, ఇచ్చిన ఎస్టిమెంట్ కాపీ, వినతి పత్రం ఇవ్వడం జరిగినది. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రెస్ క్లబ్ నిర్మాణానికి సంబంధించిన రూ.12 లక్షల మేర నిధులు విడుదల అయ్యాయని, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్సు త్వరలోనే అందజేస్తామని తెలిపినారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, సంయుక్త కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, ఈశ్వర్ యాదవ్, గౌరవసలహాదారు చిరంజీవి, కార్యవర్గ సభ్యులు ఉమాశంకర్, నందీశ్వర్, ప్రచార కార్యదర్శి అతీక్ పాషాలు పాల్గొన్నారు.

## రైతులకు కరువు నష్టపరిహారం ఇవ్వాలి : పిక్కిలి వెంకటేశ్వర్లు

**నందికొట్కూరు, జూన్ 20 (పీపుల్స్ మోటివేషన్):-**



నందికొట్కూరు నియోజకవర్గంలో గత ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులకు కరువు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్లో నందికొట్కూరు నియోజకవర్గంలో అరకొరకు వర్షాలు పడినందు వల్ల మొక్కజొన్న, పత్తి ,మినుము, కొర్ర, కంది , ఉల్లి, పొగాకు వేరుశనగ తదితర పంటల దిగుబడులు పూర్తిగా తగ్గాయని ఆయన అన్నారు. పత్తి పంటకు నకిలీ విత్తనాల వల్ల పూర్తిగా నష్టం వాటిల్లిందని కంది కొర్ర పూర్తిగా తేమ లేకపోవడంతో పంటలు ఎండిపోవడం జరిగిందని ఆయన అన్నారు. దీనికి తోడు పండ్ల తోటలలో నీరు పంటలు పంట లేదన్నారు ఇంత నష్టం జరిగినా ప్రభుత్వ అధికారులు జూన్ మాసంలో కురిసిన వర్షాన్ని రైన్ ఫాల్స్ ఆధారంగా కరువు మండలాలుగా తీసుకోవడంతో నందికొట్కూరు నియోజకవర్గం లో మిడుతూరు పగిడ్యాల మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారని మిగతా మండలాల్లో కరువు విలయతాండవం ఆడుతున్న కేసీ కెనాల్ ఎత్తిపోతల పథకాలు ఉన్నా కానీ సరైన సమయంలో కాలువలకు నీరు లేక పంటలు ఎండిపోవడం జరిగిందని ఆయన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర కరువు బృందం అధికారులు పొలాలను పరిశీలించి కౌలు రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గోపి, శివ రాముడు, కాటేపోగు సోమన్న, శేఖర్ ,భరత్ ,వీరన్న పాల్గొన్నారు.

# పంచేంద్రియాల్లో కళ్లు చాలా ప్రధానమైనవి



**జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్ రావు**



కార్యక్రమంలో కెవి.సుబ్బారెడ్డి కళాశాల అధినేత కెవి.సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్ శర్మ, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కె.జి.గంగాధర్ రెడ్డి, ఇంఛార్జి డిఐపిఆర్ఓ దివాకర్ రావు, పాత్రికేయులు మీసాల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు, జూన్ 20 (పీపుల్స్ మోటివేషన్):-**

పంచేంద్రియాల్లోని అన్ని అవయవాల్లో కళ్లు ప్రధాన పాత్ర పోషిస్తాయని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్ రావు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ ఆవరణంలో శాంతిరాం కంటి ఆసుపత్రి, కెవి.సుబ్బారెడ్డి కళాశాల, రెడ్ క్రాస్ సొసైటీ, లైన్స్ క్లబ్, మీసాల రామస్వామి ఆధ్వర్యంలో పాత్రికేయులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్ రావు మాట్లాడుతూ అన్ని అవయవాల్లో కళ్లు ప్రధాన భూమిక పోషిస్తాయని, పాత్రికేయులు ఖచ్చితమైన సమాచారాన్ని వేగవంతంగా అందజేయడానికి ప్రతి రోజూ కృషి చేయవల్సి ఉంటుందని, అలాంటి తరుణంలో వారు సమాచారాన్ని పంచుకునే చోటే వారికి అవసరమైన కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన కంటి అద్దాలను ఉచితంగా అందజేయడానికి కృషి చేసిన శాంతిరాం కంటి ఆసుపత్రి, సుబ్బారెడ్డి కళాశాల, రెడ్ క్రాస్, లైన్స్ క్లబ్ సభ్యులకు మరియు ప్రత్యేకంగా సీనియర్ పాత్రికేయులు మీసాల రామస్వామి కృషికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వక్తలు డా.కెవి.సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అధినేత మాట్లాడుతూ ప్రజల మేలు కోసం పాటుపడే పాత్రికేయులు వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అదే విధంగా డా.శంకర్ శర్మ మాట్లాడుతూ పాత్రికేయుల కోసం తనవంతుగా ఉచితవైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందజేస్తామని తెలిపారు.



## 'ఘన వ్యర్థాల నిర్వహణ"పై దృష్టి సారించి పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం





**కర్నూలు, జూన్ 20 (పీపుల్స్ మోటివేషన్):-**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఈ రోజు అనగా 20-06-2024 "ఘన వ్యర్థాల నిర్వహణ"పై దృష్టి సారించి పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక కార్యక్రమంను నిర్వహించాలని న్యాయ సేవ సదన్ నందు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీలు, సంభందిత శాఖలతో నిర్వహించి "ఘన వ్యర్థాలు" అంటే మరియు ఘన లేదా పాక్షిక-ఘన గృహ వ్యర్థాలు, సానిటరీ వ్యర్థాలు, వాణిజ్య వ్యర్థాలు, సంస్థాగత వ్యర్థాలు, క్యాటరింగ్, మార్కెట్ వ్యర్థాలు మరియు ఇతర రహితమైనవి నివాస వ్యర్థాలు, వీధి ఊడ్చుడం, ఉపరితల కాలువల నుండి తొలగించబడిన లేదా సేకరించిన ఉద్యానవన వ్యర్థాలు, వ్యవసాయం మరియు పాడి వ్యర్థాలు, శుద్ధి చేయబడిన బయో-మెడికల్ వ్యర్థాలు మినహాయించి పారిశ్రామిక వ్యర్థాలు, బయో-మెడికల్ వ్యర్థాలు మరియు ఇ-వ్యర్థాలు, బ్యాటరీ వ్యర్థాలు, రేడియో-యాక్టివ్ వ్యర్థాలు. ఈ వ్యర్థాలు దృష్టిలో ఉంచుకొని వాటిని తొలగించుట కొరకు సంబంధిత అధికారులకు కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్టూడెంట్స్ కి మరియు గ్రామం, మండల స్థాయి లో ఈ కార్యక్రమంలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపిఓ నాగరాజ నాయుడు, డియలపిఓ. ఎస్.నూర్జహాన్, డిఆర్‌పి. వి.జేమ్స్ కృపావరం, ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, సైంటిఫిక్ ఆఫీసర్, జే.గణేశ్ కుమార్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ అవతవకలపై.. మోడీ నోరు మెదపరేం

**లీకు ఆరోపణలు వస్తున్నా చర్యలు లేవా**
**మోడీ ప్రభుత్వంపై మండిపడ్డ రాహుల్**

**న్యూఢిల్లీ,జూన్20(పీపుల్స్ మోటివేషన్):**

నీట్ పరీక్షలో అక్రమాలు, యుజిసి-నెట్ రద్దుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మానసికంగా కుప్పకూలిన ప్రధాని నరేంద్ర మోడీ ఈ తరహా ప్రభుత్వాన్ని నడపడానికి అష్టకష్టాలు పడతారని రాహుల్ వ్యాఖ్యానించారు. గురువారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి, దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ విద్యా సంస్థలను కబ్జా చేయడమే పేపర్ లీకులకు ప్రధాన కారణమని ఆరోపించారు. ఆ పరిస్థితి మారనంత వరకు ప్రశ్నా పత్రాల లీకులు ఆగబోవని ఆయన చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో మోడీ మౌలిక భావనను ప్రతిపక్షాలు ధ్వంసం చేశాయని, వినమ్రంగా ఉండే అటల్ బిహారీ వాజ్‌పేయి లేదా మన్మోహన్ సింగ్ వంటి ప్రధాని ఉండి ఉంటే ప్రభుత్వం మనుగడ సాగించి ఉండేదని రాహుల్ చెప్పారు. ఆసక్తికరమైన రోజులు ముందున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో తన స్పీకర్ ఉండాలన్న తాపత్రయమే తప్ప నీట్ పరీక్ష కారణంగా వేదనను అనుభవిస్తున్న లక్షలాది మంది వ్యార్థుల గురించి ప్రధాని మోడీకి ఇప్పుడు పట్టదని రాహుల్ విమర్శించారు. ప్రతిపక్షాలు కొట్టిన దెబ్బతకు కుదేలైపోవడం వల్లే ప్రధాని మోడీ మౌనాన్ని ఆశ్రయించారని, ప్రస్తుతం ఆయన అజెండా స్పీకర్ ఎంపిక మాత్రమేనని రాహుల్ ఎద్దేవా చేశారు. నీట్ గురించి ఆయనకు ఏమీ పట్టదని రాహుల్ చెప్పారు. స్పీకర్ పదవి తన పార్టీకే దక్కాలని, తన ప్రభుత్వం గ్టటెక్కాలని మాత్రమే మోడీ ఇప్పుడు ఆలోచిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మోడీ దృష్టిలో ప్రభుత్వాన్ని నడిపించడమంటే ప్రజలను భయపెట్టి వారి నోళ్లు మూయించడమని, ఇప్పుడు మోడీని చూసి ప్రజలు భయపడే పరిస్థితి లేదని రాహుల్ చెప్పారు. ఉక్రెయిన్?రష్యా యుద్ధాన్ని, ఇజ్రాయెల్? గాజా యుద్ధాన్ని ప్రధాని మోడీ ఆపారని చెప్పుకునే వారు. అయితే ఆయనకు(మోడీకి) పరీక్ష పత్రాల లీకులను ఆపడం సాధ్యం కాదా లేక ఆపడం ఇష్టం లేదా అంటూ రాహుల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తన భారత్ జోడో న్యాయ యాత్ర సందర్భంగా పేపర్ లీకుల గురించి వేలాది మంది ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. వ్యాపం కుంభకోణాన్ని దేశమంతటా విస్తరించాలన్న ఆలోచన ఉన్నట్లు కనపడుతోందని బిజెపిని ఉద్దేశించి రాహుల్ ఆరోపించారు. ఏ విషయంపైన ఏకపక్ష నిర్ణయం జరగకూడదని, ఒక ప్రశ్నాపత్రానికి వర్తించే నిబంధన అన్నిటికీ వర్తించాలని ఆయన చెప్పారు. పరీక్షా పత్రాల లీకుల అంశాన్ని ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో లేవనెత్తు తాయని, తగిన చర్యలు తీసుకుని ఉన్నత ప్రమాణాలను నిలబెట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాయని ఆయన తెలిపారు.

